విశాలాంధ్ర
తిరుపతి జిల్లా
చిత్తూరు జిల్లా
సోమవారం 18, డిసెంబరు 2023 8పేజీలు




జిల్లాలో గవర్నర్ పర్యటన : కలెక్టర్

విశాలాంధ్ర – తిరుపతి : ఈనెల 18 ,19 తేదీలలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జిల్లాలో పర్యటించనున్నారని విధులు కేటాయించిన అధికారులు పర్యటన విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె .వెంకటరమణారెడ్డి సూచించారు.ఆదివారం ఉదయం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గవర్నర్ పర్యటనపై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ భారతి,నగరపాలక కమిషనర్ హరిత, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ ఈనెల 18న సోమవారం ఉదయం10.30గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరగనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న సంక్షేమ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఆడిటోరియంలో అవసరమైన బ్యాక్ డ్రాప్, పి ఎ.సిస్టం వంటి ఏర్పాట్లు జాగ్రత్తగా చూడాలని సూచించారు. అనంతరం తిరుమల చేరుకుని రాత్రి బస చేయనున్నారని ఈ నెల 19న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారని, సాయంత్రం 4.30గంటలకు రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకొని ధురంతో ఎక్స్‌ప్రెస్ లో విజయవాడ వెళ్ళనున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ , జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, స్మార్ట్ సిటీ జి ఎం చంద్రమౌళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు

సమస్యల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: సమస్యల సాధనకోసం కార్మికవర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారం శ్రీకాళహస్తిలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి హరినాథరెడ్డి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కార్మికులు సుదీర్ఘ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులు కష్టజీవులను కట్టు బానిసలుగా మారుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జగన్ సర్కారు సమ్మె హక్కును కాలరాసి ప్రశ్నించే వారిని జైలుకు పంపుతోందన్నారు. అధికారం కోసం అనేక వాగ్దానాలు చేసిన జగన్... అమలులో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అంగన్వాడీ, ఆశా, పంచాయతీ, పురపాలక కార్మికుల సమస్యలు పరిష్కరించక పోవడం బాధాకరమన్నారు. జగన్ తన చేతకాని తనంతో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారన్నారు. ఇక వైసీపీ శాసనమండలి సభ్యుడు అనంతబాబు దళిత కులానికి చెందిన తన డ్రైవర్ ను హత్యచేస్తే అధికార పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పైగా ఆయన జైలు నుంచి బెయిల్ పై విడుదలైన సందర్భంగా వైసీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలకడం సిగ్గు చేటన్నారు. దళితుల పట్ల జగన్ సర్కారు తీరు ఎలా ఉందో ఈ సంఘటనే 32మంది యువత ప్రాణత్యాగంతో వచ్చిన విశాఖ ఉక్కు పరిశ్రమను నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమైందన్నారు. ఈ చర్యను జగన్ సర్కారు వ్యతిరేకించకుండా పరోక్షంగా మద్దతు తెలుపుతోందని హరినాథరెడ్డి ఆరోపించారు. అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం సుమారు 35వేల ఎకరాలు సేకరిస్తే... జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రజలకు త్రిశంకు స్వర్గం చూపుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ నియంతృత్వ పోకడలతో పాలన చేస్తున్నారన్నారు. గతంలో సమ్మె చేస్తే ప్రభుత్వాలు చర్చలకు పిలిచే వారని... నిర్బంధమన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు, మహిళలు, దళితులు, అణగారిన వర్గాలపై దాడులు పెరిగి పోయాయని హరినాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామని చెప్పి... వారిని రెంటికీ చెడ్డ రేవడిలా మార్చారన్నారు. రాష్ట్రం సొంత జాగీరులా పాలన చేస్తే కుదరదన్నారు. నియంతలా పాలిస్తున్న జగన్ కు గుణపాఠం చెప్పాలని హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ తిరుపతి జిల్లా బాధ్యులు నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం అద్దదారుల్లో వాడుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని వారికే ఇవ్వాలన్నారు. కార్మికుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు. ఇక సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ తిరుపతి జిల్లా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో జగన్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. తిరుపతిలో రుయా, ఎస్వీ యూనివర్శిటీ, మెడికల్ కళాశాలలో పని చేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. నెలల తరబడి వారు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరమన్నారు. మెడికల్ కళాశాలలో యూనియన్ లేకుండా చేయడానికి అధికార పార్టీ నేతలు కుట్రపన్నుతున్నారని ఆయన ఆరోపించారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండులో 125మంది స్వీపర్లు పని చేయాల్సి ఉండగా కేవలం 40మందితో ఈ పనులు చేయిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ, పురపాలక శాఖల్లో పని చేసే కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇక అంగన్వాడీ కార్యకర్తలు తమ వేతనాలు పెంచాలని సమ్మె చేస్తుంటే... సచివాలయ ఉద్యోగులచే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగుల కొట్టించడం బాధాకరమన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగుల కొట్టే వారికి తలలు పగుల కొట్టాలని మురళి పిలుపు నిచ్చారు.

అంగన్వాడి కార్మికులు ఉద్యమాలకు సన్నద్ధం కావాలి

ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు పిలుపు

విశాలాంధ్ర –చిత్తూరు: అంగన్వాడి కార్మికులు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. అంగన్వాడి కార్మికులు నిరవధిక సమ్మె లో భాగంగా శనివారం చిత్తూరు నగరం కట్టమంచి చెరువు స్వామి వివేకానంద విగ్రహం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ఏఐటియూసీ సిఐటియు నేతలు . ప్రభావతి, .సుజిని నాయకత్వంలో మానవహారం చేపట్టారు ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ .నాగరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తన పాదయాత్రలో నేను అధికారంలోకి వస్తే అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న వేతనం కన్నా వెయ్యి రూపాయలు ఎక్కువగా ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఎన్నికలు సమీపించే రోజులు దగ్గర పడుతున్న ఇప్పటికీ కార్మికులు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందడమే కాకుండా ఎన్నికలు వస్తున్నా సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక ప్రజలను రైతులను మోసం చేయడానికి ఎన్నికల జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. అంగన్వాడి కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్చాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని ,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ,ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ,రాజకీయ వేధింపులను అరికట్టాలని, కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని తదితర సమస్యలపై గత 12వ తేదీ నుండి అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించకపోగా తమ సిబ్బం దితో ,తమ పార్టీ కార్యకర్తలతో బెదిరించడం కాగితాలలో బలవంతంగా సమ్మె విరమిస్తున్నట్లు రాయించడం ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరించడం,అంగన్వాడి సెంటర్లకు ఉన్న తాళాలను దొంగల్లాగా పగలగొట్టడం చూస్తే ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం విషయంలో జగన్మోహన్ రెడ్డి వైఖరి పై మిలిటెంట్ పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజిని ప్రభావతి అరుణ బుజ్జి రమాదేవి ఏఐటీయూసీ చిత్తూరు నియోజక వర్గ కార్యదర్శి దాసరి చంద్ర , ఐటిసి ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రమాదేవి బాలాజీ రావు, లతా రెడ్డి తోపాటు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు..

ఆటకు వేళాయరా....?!

- వేదురుకుప్పంలో జల్లికట్టుకు "సై"రన్ - నిషేధాజ్ఞలు డోంట్ కేర్
- జనసంద్రం తో గోవిందవారిపల్లి - పలువురు సహసికులకు,ఎద్దులకు గాయాలు - పత్తా లేని పోలీసులు.

విశాలాంధ్ర –వెదురుకుప్పం:సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మూడవరోజు పశువుల పండుగ రోజు సంప్రదాయం పేరుతో నిర్వహించే జల్లికట్టు ఎప్పుడుబడితే అప్పుడు ఏడాది పొడవునా నిర్వహించే క్రీడగా మారిపోయింది.ఎద్దులు, ఆవుల్ని జనాల్లోకి వుసిగొలిపి వాటి కొమ్ములకు కట్టిన బహుమతుల కోసం నిలువరించే క్రమంలో అటు పశువులకు,ఇటు సహసికులకు తీవ్ర గాయాలై అవయవాలు కోల్పోవడం తో పాటు మృత్యువాత పడిన సందర్భాలు లేకపోలేదు.జల్లికట్టు నిర్వహించకూడదని న్యాయస్థానాల నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ పట్టించుకునే నాదులే కరువయ్యారు.ఈ ఏడాది సంక్రాంతి ముందే డిసెంబర్ నెలలో నే ముందస్తుగా వెదురుకుప్పం మండలం గోవిందవారి పల్లి జల్లికట్టు సైరన్ మోగించారు. అసలేం జరుగుతోందంటే...చిత్తూరు జిల్లాలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సాంప్రదాయం పేరుతో నిర్వహించే పశువుల పండుగ కాస్తా జల్లికట్టు గా మారిపోయింది.జిల్లా లో పలుప్రాంతాల్లో పండుగ సందర్భంగా జల్లికట్టు నిర్వహించినా వెదురుకుప్పం లో మాత్రం ఏడాది పొడవునా అప్పుడప్పుడూ పండుగలు, పబ్బాలు, జాతరలు లాంటి సందర్భాల్లో జల్లికట్టు నిర్వహిస్తున్నారు. జల్లికట్టు నిర్వహించకూడదని న్యాయ స్థానాలు ఆదేశాలు ఉన్నప్పటికీ కట్టడి చేయాల్సిన యంత్రాంగం నిద్రావస్థలో ఉండడానికి సజావుగా నిర్వహిస్తున్న జల్లికట్టు ఉదాహరణ.జల్లికట్టు అంటే ఇలా....సంక్రాంతి పండుగ లో భాగంగా మూడోరోజు పశువులను శుభ్రం చేసి వాటి కొమ్ములకు రంగులు అద్దుతారు.ప్రత్యేక అలంకరణలు చేసి వాటి కొమ్ములకు బహుమతులు కట్టి జనంలోకి తరుముతారు. పరుగులు తీస్తూ వచ్చే ఎద్దులను సహసికులు నిలువరించి బహుమతులను కైవసం చేసుకోవడమే జల్లికట్టు. వెదురుకుప్పం లో జల్లికట్టు మండలం లోని గోవిందవారి పల్లిలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు.ఉదయం నుంచి భారీ ఏర్పాట్లు చేశారు.గ్రామం లోని పశువులతో పాటు చిత్తూరు,తిరుపతి జిల్లా ల నుంచి ఎద్దులు,ఆవులను వాహనాల ద్వారా తీసుకొచ్చారు. ముందస్తుగా జల్లికట్టు నిర్వహణ ప్రచారం ఉండడం తో పలు ప్రాంతాల నుంచి జనాలు భారీ గా చేరుకున్నారు. దీంతో గోవిందవారి పల్లి గ్రామ పరిసరాలు జనసంద్రం తో వాహనాలతో నిండిపోయాయి.పందెలకు సిద్ధం చేసిన ఎద్దులు,ఆవుల కు బహుమతులు కట్టి జనం లోకి వదిలారు.వాటిని నిలువరించే క్రమంలో సహసికులకు కొందరికి గాయాలయ్యాయి.ఈక్రమం లో పలు పశువులకు గాయాలయ్యాయి.

కళ్యాణ మండపం నిర్మాణం కొరకు విరాళం

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం సోమల గ్రామంలో వెలసిన శ్రీ స్వయం బెస్వర ఆలయం ఆవరణలో దాతల సహవ సహకారాల తో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణం కోసం ధర్మ వరం కు చెందిన బండ్ల పావని భర్త సోమశేఖర్ తల్లిదండ్రులు దివంగత బండ్ల కమలమ్మ భర్త చిన్న వెంకట స్వామి జ్ఞాపకార్థం ఆలయ ధర్మకర్త బి.వి.సోమశేఖర్ కు రూ.10 116/లు ను విరాళం గా అందజేశారు.ఈ కార్యక్రమంలో డి.మనోహర్ ,లింగన్న ,గన్న చెన్న కేశవులు ,ఈశ్వరమ్మ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తార్పాల్ పట్టాలు పంపిణీ చేసిన మిద్దెల హరి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని ఏనుగులగుంట ప్రాంత ప్రజలకు 30 తార్పాల్ పట్టాలను మిద్దెల హరి యువసేన ఆధ్వర్యంలో మాజీ ఆప్కో డైరెక్టర్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరి పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం 4వ వార్డు ఏనుగులగుంట ప్రాంతంలో ఇటీవల తుఫాను వల్ల దెబ్బతిన్న నివాస ప్రాంతాలను ఆయన పరిశీలించి దెబ్బతిన్న పూరి గుడిసెలకు తార్పాల్ పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం ఏనుగులు గుంట ప్రాంతంలో మిద్దెల హరి స్థానిక నాయకులతో కలిసి దెబ్బతిన్న పూరి గుడిసెలకు 30 తార్పాల్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిద్దెల హరి యువసేన నాయకులు ఇసుక మట్ల బాల, గంజి వెంకటేష్, దావాల గిరి, చెన్నయ్య, గాంధీ, దోనే పతి సురేష్, జగ్గు, దోనే పతి శివ, విజయమ్మ, వెంకటేష్, శివ, కొమ్మల సాయి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలోకి భారీగా వలసలు

విశాలాంధ్ర - పలమనేరు : పెద్దపంజాణి మండలంలో ఆదివారం అమర్నాథరెడ్డి చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో వైకాపా నుంచి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగాయి. ఈ సందర్భంగా కంపాల్యానికి చెందిన టీ. చంద్రప్ప ఆధ్వర్యంలో సుమారు 50 మందికి పైగా యువకులు వైకాపా నుంచి టిడిపిలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉదయ్ కుమార్, భద్ర, చంద్రప్ప, బుజ్జి, సుబ్రహ్మణ్యం, సాయి, యుగంధర్, కృష్ణప్ప, అనిల్ తదితరులున్నారు. అదేవిధంగా సురగుంట్ల గ్రామానికి చెందిన భాస్కర్, ఎం. సుబ్రహ్మణ్యం, గంగులప్పా, జి.సుబ్రహ్మణ్యం,నరసింహులు, ఆర్.సుబ్రహ్మణ్యం మరియు అనుచరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక అదే విధంగా గౌదమాకులపల్లి ఎస్సీ కాలనీలో సైతం పలువురు వైకాపా నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రెడ్డప్ప, గంగులప్పా, సత్యన్నా, గంగాధర్, చంద్రప్ప, జయరాం, కృష్ణప్ప,సురేంద్ర, లింగప్ప, గంగప్ప, మాసిన్న, గురుమూర్తి, సుబ్రమణ్యం లతోపాటు మరికొంతమంది పార్టీలో చేరారు. పెద్దపంజాణి మండలంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలోకి వలసలు రావడం జరిగింది. సుమారు వందమందికి పైగా వైకాపా నేతలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరడం గమనార్హం.

అంగన్వాడీల సమ్మెకు యూటీఎఫ్ సంఘీభావం



విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా గత ఆరు రోజులుగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు, ఐఎఫ్టియూ అనుబంధ సంఘాల అంగన్వాడీ నాయకులు చేస్తున్న నిరవధిక సమ్మెకు యూటీఎఫ్ నాయకులు ఆదివారం సంఘీభావం తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను విస్మరించడం తగదన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు రూ.2లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి అన్ని రాయితీలు కల్పించాలని కోరారు. ఫోటో పిలుపు మేరకు అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు. సిఐటియు నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, రేవతి, పుష్ప, సౌజన్య, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు తదితరులు. పాల్గొన్నారు.

శాసనాల ద్వారా శ్రీవారి వైభవాన్ని చాటిన సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి

- ప్రముఖ శాసన పరిశోధకులు సొరకాయల కృష్ణారెడ్డి - 135వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

విశాలాంధ్ర - తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని ప్రముఖ శాసన పరిశోధకులు తొండవాడకు చెందిన శ్రీ సొరకాయల కృష్ణారెడ్డి తెలిపారు.తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి 135వ జయంతి సభ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా శ్రీ కృష్ణారెడ్డి ఉపన్యసిస్తూ, శ్రీవారి ఆలయం ఉన్నంతవరకు ఆయన చిరంజీవిగా నిలుస్తారన్నారు. టీటీడీలో చిన్న స్థాయి ఉద్యోగిగా ఉంటూ వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి అని చెప్పారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇందులో అధిక భాగం సంకీర్తనలను శ్రీ శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించినట్లు ఆయన వివరించారు.అంతకుముందు టీటీడీ సిపిఓ శ్రీ శేష శైలేంద్ర మాట్లాడుతూ, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అమూల్యమైన సేవలందించిన శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ రాళ్ళ పల్లి అనంత కృష్ణ శర్మ వంటి మహనుభావుల జీవితాలను, వారు చేసిన కృషిని విద్యార్థులు తప్పని సరిగా తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. వీరి సేవలు తెలుసుకుని సమాజానికి ఉపయోగపడే వారిలా మారితేనే చదువుకు సార్థకత లభిస్తుందని ఆయన చెప్పారు. శ్రీ సాధు సుబ్రమణ్య శాస్త్రి వెలికి తీసి పరిష్కరించిన శాసనాల పుస్తకాలను పిల్లలు, పెద్దలు కూడా చదవాలన్నారు.అనంతరం ప్రముఖ పాత్రికేయులు శ్రీ మా శర్మ "శాస్త్రి గారి బహుముఖ ప్రజ్ఞ" అనే అంశంపై ఉపన్యసించారు.పుష్పాంజలి అంతకుముందు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి 135వ జయంతి సందర్భంగా తిరుపతిలోని శ్వేత భవనం ఎదురుగా గల ఆయన విగ్రహానికి సివి అండ్ ఎస్ఓ శ్రీ నరసింహ కిషోర్, టీటీడీ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ టి.రవి తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రి కూతురు గిరిజ, మనుమడు, జడ్జి శ్రీమూర్తి, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణ శర్మ పాల్గొన్నారు.

జనసేన-తెలుగుదేశం పార్టీల సమన్వయ పోరాటం

విశాలాంధ్ర-చిత్తూరు : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా రాక్షస పాలనను అంతమొందించడానికి, తెలుగుదేశం పార్టీతో కలిసి నడవాలని, రాష్ట్ర ప్రజలను కాపాడుకోవాలనే ఆకాంక్ష మేరకు, ఆదివారం పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు మండలం వేపనపల్లి పంచాయతీలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారి మనోహర్ ఆధ్వర్యంలో జనసేన మరియు తెలుగుదేశం పార్టీలు కలిసి ప్రజాక్షేత్రంలో పర్యటించి ప్రజల యొక్క ఇబ్బందులను తెలుసుకొని, ఉమ్మడి పోరులో ఒక అడుగు ముందుకు వేశారు. ఉచితాలు మాకు వద్దని మా పిల్లల భవిష్యత్తు కావాలని, నిరుద్యోగం నిర్మూలించి, యువతకు తగు ఉద్యోగాలు కల్పించాలని ప్రజలు కోరారు. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక ఎన్నికల ప్రణాళికను రూపొందిస్తూ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఎలా పని చేయాలో ప్రజలే నిర్ణయించే విధంగా పార్టీ అధినాయకులు వ్యూహరచన చేస్తున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి తులసి ప్రసాద్ తెలియజేశారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పిస్తూ, వారి అభ్యున్నతకు పాటుపడే విధంగా ప్రణాళికలు ఉంటాయని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు ఆదుకుంటామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కలికిరి మురళీమోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుమార్, రాజశేఖర్, దొరబాబు, నాయకులు చింటు, చంద్రమౌళి, ప్రభాకర్, హేమాద్రి, ఉదయ్, పూర్ణ చంద్ర, చంటి, మౌని, త్యాగరాజులు, కిషోర్, వినీత్, మనోజ్, సందీప్, భాను, భార్గవ్, పూర్ణ, చంద్ర మరియు నాయకులు పాల్గొన్నారు.

ఆటకు వేళాయరా....?!

(మొదటి పేజీ తరువాయి) కాగా తిరుపతి జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి చెందిన ఎద్దు తీవ్రంగా కాలువిరిగి గాయపడి స్పృహ తప్పిపడిపోయింది.పట్టీలు కైవసం చేసుకొనే క్రమం లోనే బహుమతులు నాదంటే నాదని వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.యువత మధ్య కొద్దిసేపు గొడవలు జరిగాయి. అనంతరం స్థానికుల చొరవతో సర్దుమనిగాయి.వేలాదిగా తరలివచ్చిన జనానికి నిర్వాహకులు అన్నదానం,తాగునీరు ఏర్పాట్లు చేశారు. జల్లికట్టు నిర్వహణ వద్ద పోలీసులు కానరా లేదు.చెదురు ముదురు ఘటనల మినహా జల్లికట్టు ముగిసింది.జల్లికట్టు నిర్వహణ పై నిషేధాజ్ఞలు వున్నా పశువుల్ని హింసించడం పై సంబంధిత యంత్రాంగం దృష్టి సారించాలని జంతు ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాటు సారా పట్టివేత

విశాలాంధ్ర - గుడిపాల : ఎస్ఐ రామ్మోహన్ సమాచారం మేరకు గుడిపాల మండలంలోని పాప శెట్టిపల్లి గ్రామంలో నాటు సారా కాచి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై మరియు తమ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయగా చెట్ల చాటులో 30 లీటర్ల నాటు సారా లభ్యం ప్రదేశం స్థలం నుంచి వ్యక్తి పారిపోవడంతో 30 లీటర్ల నాటు సారాన్ని సీజ్ చేశామని చెప్పారు, ఇటువంటి అసాంఘిక కార్య కలాపాలు ఎవరైనా చేస్తే చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాజీవ్ నగర్ లో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ లో భూ ఆక్రమణలు నిత్యకృత్యంలా మారుతున్నాయి. కొందరు రాజకీయ నేతలు సిండికేట్ గా ఏర్పడి ఖాళీ జాగా కనబడితే చాలు అడును చూసి పాగా వేసేస్తున్నారు. పేదల ఇంటి నిర్మాణాలు, భవిష్యత్ అవసరాల కోసం రాజీవ్ నగర్ లో కేటాయించిన వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఇప్పటికే ఆక్రమణకు గురైన తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజీవ్ నగర్ లో కమ్యూనిటీ అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలను సైతం అక్రమార్కులు వదలడం లేదు. ఈ క్రమంలోనే రాజీవ్ నగర్ ఓవర్ హెడ్ ట్యాంక్ దగ్గర మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి కేటాయించిన 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆదివారం కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించారు. అందరూ చూస్తుండగానే ఎక్కవేటరుతో తవ్వించి పునాదులు వేశారు. ఇదేంటని అడిగిన స్థానికులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో రాజీవ్ నగర్ వాసులు స్థానికంగా ఉంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంఘటనా స్థలానికి వెళ్లి ఆక్రమణలను అడ్డుకున్నారు. అక్కడ నుంచే జిల్లా కలెక్టర్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించి స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతో పనులను పూర్తిగా ఆపివేయించారు. రాజీవ్ నగర్ ప్రాంతంలో భవిష్యత్తు అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలన్నింటిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పుల్లయ్య డిమాండ్ చేశారు. సత్వరమే స్పందించి రాజీవ్ నగర్లో భూ ఆక్రమణకు అడ్డుకట్ట వేసేలా ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ కు పుల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ స్మశానవాటిక నందు నూతన భోజనశాల ప్రారంభం

విశాలాంధ్ర - నాయుడుపేట.: నాయుడుపేట హిందూధర్మ సేవాసంఘం ఆధ్వర్యంలో నాయుడుపేట హిందూ స్మశానవాటిక నందు నేడు స్థానిక శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ప్రారంభించనున్నారు.నాయుడుపేట హిందూధర్మ సేవాసంఘం అధ్యక్షులు కామిరెడ్డి రాజారెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రముఖ పారిశ్రామికవేత్త పెసల జయ రాజగోపాల్ శెట్టి భోజనశాల నిర్మాణానికి విరాళాలు అందజేసినట్టు తెలియజేశారు

శ్రీవాణి ట్రస్ట్ ఆలయ నిర్మాణాలను పరిశీలించిన నిజ నిర్ధారణ కమిటి

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో జరుగుతున్న వివిధ ఆలయాల నిర్మాణ పనులను మీడియా నిజ నిర్ధారణ కమిటీ ఆదివారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మనుబోలు మండలం పీడూరు ఎస్సీ కాలనీ లో జరుగుతున్న శ్రీ సీతారామ స్వామి వారి ఆలయ నిర్మాణ పనులను, మనుబోలు మండలం గురివింద పూడి గ్రామంలో చేపట్టిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పనులను పరిశీలించి, స్థానికులతో, సంబంధిత అధికారు లతో మాట్లా డటం జరిగింది. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధుల నిర్వహణపై ఆరోపణలు రావడంతో స్పందించిన టీటీడీ నిధుల వినియోగం పై పరిశీలించు కోవచ్చని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మీడియా నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటై, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తోంది.

ఎరుపెక్కిన శ్రీకాళహస్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు సందర్భగా పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి ఎరుపెక్కింది. పట్టణ ఎక్కడ చూసినా ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. బహిరంగ సభకు ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రెండు వేల మందికి పైగా పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రామసేతు, నెహ్రూవీధి, పెళ్లిమండపం, బాబు అగ్రహారం కూడలి మీదుగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఓబులేష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి, ఏఐటియుసి నిర్మాణం బాధ్యులు నాగ సుబ్బారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, వైఎస్ మణి, ఏపీ మహిళా సమాక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నదియా, ఏఐటీయూసి జిల్లా ఆఫీస్ బేరర్స్, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాతల ఆదర్శంగా రాజకీయాల్లోకి

విశాలాంధ్ర-కోట:- తనతాతలైన నల్లపరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ,శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, గోపాల్ రెడ్డి ఆదర్శాలతో తాను రాజకీయాల్లోకి అడుగుపెట్టానని తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు.కోటలోని తనతాతలైన దివంగత నల్లపురెడ్డి గోపాల్ రెడ్డి నివాసానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొట్టమొదటిసారిగా ఆదివారం విచ్చేశారు.ఈసందర్భంగా నల్లపురెడ్డి అభిమానులు భారీగావిచ్చేసి కేశవరం గ్రామం నుంచి కోటవరకు కార్లు బైక్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం కోటలో వెలిసివున్న కోటమ్మ తల్లిఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లపరెడ్డి కుటుంబీకులు ఎప్పుడు పేదలకు అండగా ఉంటూ వారి కష్టసుఖాలను పంచుకునేవారన్నారు.ఈక్రమంలోనే తమ ఆస్తులు పోగొట్టుకున్నారే గాని ఏనాడు అవినీతికి పాల్పడలేదన్నారు.అంతకు ముందు తన తాతగార్లయినా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి,గోపాల్ రెడ్డి విగ్రహలకు,అలాగే గాంధీ, అంబేద్కర్ విగ్రహలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.ఈకార్యక్రమంలో నల్లపురెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెను వెంటనే విరమించండి

పుత్తూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జయ ప్రకాష్ చిట్టి

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెను వెంటనే విరమించాలని పుత్తూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జయ ప్రకాష్ ఆదివారం విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో అంగన్వాడి సిబ్బందికి తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న జీతం కన్నా1000 రూపాయలు పెంచుతానని మాట ఇచ్చి ప్రస్తుతం11500 ప్రతి నెల జీతం ఇస్తున్నారన్నారు.కరోనా కష్టకాలంలో దాదాపు రెండు సంవత్సరాలు ప్రతి నెల ఒకటవ తారీఖున నే పూర్తి జీతం ఇచ్చినటువంటి సందర్భాన్ని అంగన్వాడీ సిబ్బంది మరిచిపోకూడదన్నారు. దేశంలోని అన్ని ఇతర రాష్ట్రాలలో సగం జీతం మాత్రమే ఇచ్చారని కానీ సీఎం సగం జీతానికి బదులు పూర్తి జీతానికి వ్యత్యాసం దాదాపు 1,38,000 రూపాయలు దీనిని అంగన్వాడి సిబ్బంది అందరూ సహృదయంతో గుర్తించాలన్నారు. తొలుత ముఖ్యమంత్రి చేపట్టిన నవరత్నాలు అనే సంక్షేమ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది అర్హులు కారు,అయినా వీరందరి అభ్యర్థనతో ఈ అన్ని సంక్షేమ కార్యక్రమాలకు అంగన్వాడీ సిబ్బంది, కుటుంబ సభ్యులు అర్హులుగా పరిగణించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అంగన్వాడీ సిబ్బంది కుటుంబంలో ప్రతి నెల అన్ని రకాల పింఛన్లు వస్తున్నాయని,కుటుంబంలోని పిల్లలు చదువుకోవడానికి అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన అనే సంక్షేమ కార్యక్రమాలు వస్తున్నాయని,వీరి కుటుంబంలో అర్హులైనటువంటి మహిళలకు చేయూత చేదోడు అనే సంక్షేమ కార్యక్రమాలు వస్తున్నాయని,వీరి కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాల కోసం ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా 2500000 రూపాయల వరకు వైద్య ఖర్చులు అందించబడుతుందని గుర్తు చేశారు. వీరి కుటుంబంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా వేల రూపాయలు వీరి ఖాతాలలో జమ చేయబడిందని, ఇల్లు, ఇంటి స్థలము లేనటువంటి అంగన్వాడీ సిబ్బందికి ఇంటి స్థలం, ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయము అందిస్తున్నారని, ఈ సిబ్బంది కుటుంబాలలో రైతులు ఉన్నట్లయితే వాళ్లకు రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందుతున్నదని చెప్పారు. అన్నీ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అంగన్వాడీ సిబ్బందికి ఇప్పటికే 1,819 కోట్ల రూపాయలు ప్రభుత్వం వెచ్చించిందని, పరిపాలన సౌలభ్యం కోసం 86 కోట్ల రూపాయలు వెచ్చించి 56984 కొనుగోలు చేసి సిబ్బందికి అందించడం జరుగుతుందన్నారు డేటా కోసం ప్రతి సంవత్సరం 12 కోట్లు వ్యయం చేస్తున్నదని, ఈ ఏడాది నుండి సిబ్బందికి ఎల్ ఐసి వర్తింప చేస్తూ ప్రమాద బీమా గా 2 లక్షలరూపాయలు వరకు చెల్లిస్తుందని చెప్పారు.అందువల్ల ప్రస్తుతం సమ్మె చేస్తున్నటువంటి అంగన్వాడీ సిబ్బందికి ఒక్కసారి గత 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రస్తుతం జగనన్న అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో 10 శాతం అయినా మీకు అందిందా? అని, గతంలో మీరు చేసిన సమ్మె మీద ఉక్కు పాదం మోపి మిమ్మల్ని అరెస్టు చేసి హింసించడం తప్పు అని గుర్తు చేశారు.ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న అంగన్ వాడీ సోదరీమణులు అంగనవాడి సిబ్బంది ఇన్ని విధాలుగా మీ బాగోగులు సంక్షేమపథకాలు అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వం మీద ఈర్షతో ప్రతిపక్ష పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పారు.అందువల్ల ఈ విషయాలని గమనించి ముఖ్యమంత్రి జగనన్న చేసే మంచిని గుర్తించి వెంటనే సమ్మె విరమించి మీ ప్రాంతంలో పిల్లలు , తల్లులకు ఇబ్బంది కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేసారు.

లోకేష్‌ని కలిసిన సుధాకర్ నాయుడు

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: పెందుర్తి నియోజకవర్గంలో కొనసాగుతున్న లోకేష్ పాదయాత్రలో గంగాధర నెల్లూరు మండల టిఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్ నాయుడు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్రలో పాల్గొనడం ఒక అదృష్టంగా భావిస్తూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని టిడిపి అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు అదేవిధంగా 20వ తేదీ విజయనగరంలో పాదయాత్ర ముగింపు సభకు యువత పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు

పులిచెర్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ నియామకం

విశాలాంధ్ర -పులిచెర్ల -కల్లూరు:- పులిచెర్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఐదుగురిని నియమిస్తూ రైల్వే బోర్డు అధికారి సంజీవ్ మనీషా ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజంపేట పార్లమెంట్ బిజెపి నాయకులు మాదాన్ లోకేష్ తెలిపారు. పులిచెర్ల మండలానికి చెందిన మునిరత్నం, నాగరాజు, వెంకటరమణ నాయుడు, బావాజీ, యర్రయ్యలను నియమించారని ఆయన తెలిపారు.

గ్రామవీధుల్లో ఊరేగిన బంగారమ్మ
అమ్మవారి బంగారు విగ్రహాన్ని రజకులకు అప్పగింత
నగరంలో మొదలైన జాతర సంభరాలు

విశాలాంధ్ర - కార్వేటినగరం:మేజర్ పంచాయతీ కార్వేటినగరం ప్రజలు సంస్థాధీశుల కాలం నుంచి కొంగుబంగారంగా కొలిచే శ్రీబంగారమ్మ ఆదివారం మేళ తాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగారు.ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులు. గ్రామస్తుల సమీక్షంలో అమ్మవారి బంగారు విగ్రహంతో పాటు, అమ్మవారి విలువైన ఆభరణాలను ఆనవాయితీ ప్రకారం రజకులకు అప్పగించారు. ఈ క్రమంలో భాగంగా అమ్మవారికి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళీ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి మేళతాళాలు, బందోబస్తుల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి ఇంటింటా కర్పూరహారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు మంగళ బుధవారాల్లో జరిగే జాతరను పురస్కరించుకుని గ్రామ వీధులను అమ్మవారికి ఇష్ట ప్రసాదమైన వేపాకుల తోరణాలతో అలంరించి ముస్తాబు చేశారు. అలాగే గ్రామ వీదులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్.కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై రజక సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొరపాట్లు చేస్తే శిక్ష తప్పదు:ఎస్సై

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: ప్రభుత్వ మద్యం దుకాణాల లో పనిచేస్తున్న సిబ్బంది చిన్న పొరపాటు చేసినా కేసులు నమోదు చేస్తామని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి సిబ్బంది ని హెచ్చరించారు. చిత్తూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు మరియు డిపో ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు ఆది వారం పులిచెర్ల మండలంలో గల వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది విద్యావంతులు ఉంటారని ఒకసారి ఎఫ్ఐఆర్లో వారి పేరు నమోదైతే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని గుర్తు చేశారు. మద్యం మరియు బీరు సీసాలను ప్రతిరోజు సూపర్వైజర్లు సరి చూసుకుంటుంటే స్టాకుల్లో ఎలాంటి తేడాలు ఉండవని చెప్పారు. ఎమ్మార్పీ రేట్లకే మద్యం ప్రియులకు మద్యం విక్రయించాలని తాము నిర్వహిస్తున్న డెకాయ్ ఆపరేషన్ లో ఎవరైనా అధిక ధరలకు అమ్మినట్లయితే కేసులు బనాయిస్తున్నట్లు కూడా చెప్పారు. నిల్వగల స్టాకును సిబ్బంది సహాయంతో ప్రతి బాక్స్ ను కిందకి దింపి నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీ లలో ఆయన వెంట వెరిఫికేషన్ ఆఫీసర్లు నాగరాజు,లోకనాథం మరియు సూపర్వైజర్ లు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

వలమనేరు - విశాలాంధ్ర: స్థానిక పెన్షనర్ల సంఘ భవనం నందు ఆదివారం జాతీయ పెన్షన్ దినోత్సవమును సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డిఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రముఖ డాక్టర్ లక్ష్మీనారాయణ శెట్టిపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెన్షన్ కు ఒక సమగ్ర విధానం కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి డిఎస్ నాకర అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి వై వి చంద్ర చూడ్ కృతజ్ఞతలు తెలిపారు. పాత పెన్షన్ విధానానికి తూట్లు పొడిచి సిపిఎస్, జిపిఎస్ లని పెన్షనర్ల గొంతు నొక్కుతున్నారన్నారు. 11వ పిఆర్సి ఇంతవరకు పూర్తిస్థాయి అమలు కాలేదు అన్నారు.పి ఆర్ సి బకాయిలు 186 నెంబర్ డి ఎ బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదని ఐదు సంవత్సరాలు ఎన్నికైన నాయకులు పెన్షన్ 35- 40 సంవత్సరాలు ప్రభుత్వానికి సేవ చేసి ఉద్యోగులకు మాత్రం పెన్షన్ భారం అని మేధావులు ఆలోచిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రత్నారెడ్డి, గురుమూర్తి, దొరస్వామి,దవనముని, శేఖర్,పాపయ్య, నాగభూషణం, కన్నయ్య, గోవిందరాజులు,పొన్ముడి,మనోహర్,రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

దిగవూరు లో టిడిపికి షాక్

విశాలాంధ్ర- చిన్నగొట్టిగల్లు : వైఎస్ఆర్సీపీ లో చేరిన రెడ్డప్ప రెడ్డి.మాజీ సర్పంచ్ చంద్రారెడ్డితో పాటు పలువురు చేరిక.కండువాలు కప్పి స్వాగతించిన తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి. దిగవూరు, చిన్నగొట్టిగల్లు మండలం టీడీపీకి బలమైన షాక్ తగిలింది. ఏళ్లుగా పార్టీలో దిగవూరు పంచాయతీలో పెద్ద దిక్కుగా ఉన్న సభ్యులు తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్సీపీ కండువాలు కప్పుకున్నారు. టిడిపి నాయకులు రెడ్డప్ప రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డితో పాటు దీప్తి, రెడ్డమ్మ, శేఖర్ రెడ్డి, సదాశివ రెడ్డి, సరోజ, నాగరాజ పలువురికి తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అంతకుముందు వారు మోహిత్ రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సేవలకు ఆకర్షితులమయ్యామని వారు వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మెన్ మోహిత్ రెడ్డి సమక్షంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. చంద్రగిరి 2024 వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు.

వాహనాల తనిఖీలలో పోలీసులు

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బస్ స్టాండ్‌లో వాహనాలను ఎస్.ఐ.వెంకట నరసింహులు సిబ్బంది తనిఖీలను నిర్వహించారు. ఈ క్రమంలో వాహనాలు నడిపేవారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అందులో 2 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మరియు 6 బహిరంగ డ్రంక్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో వాహనదారులు త్రాగి నడపరాదని అలాగే తల్లిదండ్రులు మైనర్ పిల్లలు కు ద్విచక్ర వాహనాల ను నడుపుటకు ఇవ్వరాదని తెలిపారు. అలాగే ముగ్గురు కలిసి ఒక ద్విచక్ర వాహనాల ను నడపరాదని తెలిపారు వీటిని ఉల్లంఘించి న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా పెన్షనర్స్ డే

విశాలాంధ్ర - కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో పెన్షనర్స్ ని ఆదివారం విశ్రాంతి ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్రాంతి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగ సంఘాల న్యాయ పోరాటం కోసం మొట్ట మొదట పోరాటం చేసిన డీఎస్ నకారా సేవలను కొనియాడారు. అదే బాటలో అందరు పయనించాలని కోరారు. అనంతరం నకార చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ క్రమంలో భాగంగా 75 సంవత్సలు దాటిన సీనియర్ సిటిజన్లు శ్యామ్యూల్, వీ.ఎస్. చంద్రమ్మ, ఎన్.క్రిష్ణయ్య, దేశప్పపిళ్లైలకు ఎంపీడీవో మోహనమురళీ, స్టేట్ బ్యాంకు మేనేజర్ ఆర్.వీ క్రిష్ణారావు, యూఎస్ఏ ప్రముఖ శాస్త్రవేతలు పి. జగదీశ్ వరన్ కలసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జయచంద్రయ్య, కార్యదర్శి సుకుమార్వర్మ సభ్యులు బీవీ ఘటికాచలు. కే.విజయకుమార్ పిళ్లై, శ్రీధర్వర్మ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా రైల్వే పెన్షనర్స్ డే

విశాలాంధ్ర - పాకాల : 39వ రైల్వే పెన్షనర్స్ డేని ఆదివారం స్థానిక పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాల్ లో ఘనంగా నిర్వహించారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆల్బర్ట్ అధ్యక్షతన నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమానికి పెన్షనర్స్ డివిజనల్ అధ్యక్షులు జయంత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయంత్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్లు తమ సమస్యలు కార్యాలయంలో తెలియజేయాలని జనవరి 6వ తేదీన దీనికోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షనర్ల సమస్యలను డివిజనల్ స్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చీఫ్ అడ్వైజర్ గురవయ్య నాయుడు మాట్లాడుతూ పెన్షనర్లకు ఇమిడి కార్డు ఒక వరం లాంటిదని దానివలన ప్రైవేట్ హాస్పిటల్‌లో సైతం వైద్య సేవలు పొంద వచ్చునని దీన్ని దృష్టిలో ఉంచుకొని అందరు కార్డుకు దరఖాస్తు చేసుకొని తెప్పించుకో వాలన్నారు. అయితే ప్రస్తుతం పిపిఓలు రావడం లేదని దీనివలన ఇమిడి కార్డు పొందడంలో జాప్యం జరుగుతోందని ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రామయ్య , ఖాదర్ బాషా, మునిరత్నం రెడ్డి, ప్రభాకర్, లక్ష్మీకుమారి ,రామస్వామి పిళ్లై పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కపిలతీర్థం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిబిఇసిసి ప్రధాన కార్యదర్శి జె.ధన్వంత్‌కుమార్, అధ్యక్షులు పి.విజయభాస్కర్ ప్రసంగిస్తూ కార్తీక మాసం సందర్భంగా భక్తులకు, పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు సామాజిక సేవలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గత ఏడు సంవత్సరాల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపట్టనున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రజలందరికి వివిధ ప్రయోజనాలను అందిస్తున్నాయని, ప్రజలందరూ బ్యాంకు ఖాతాలను పొంది బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు భాస్కర్, జనార్దన్, సుమలత, రేష్మ, నందగోపాల్, మహేష్, కేశవరెడ్డి, నిర్మల, యజ్ఞేష్‌బాబు, పవన్, లక్ష్మీపతి, ఇతర బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

పెద్దజీయర్ మఠం, ఆస్థాన మండపంలో తిరుప్పావై పారాయణం

విశాలాంధ్ర - తిరుపతి: ధనుర్మాసం ప్రారంభం కావడంతో తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించారు. జనవరి 14వ తేదీ వరకు తిరుప్పావై పారాయణం కొనసాగుతుంది. ఆదివారం తెల్లవారుజామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభమయ్యాయి.ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం...పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి ఒకటిన్నర గంట ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహ విష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. కావున ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.ఆండాళ్ తిరుప్పావై పారాయణం...12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరు. వీరిని నాచియార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామివారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో రుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది. పెద్దజీయర్ మఠంలో, ఆస్థాన మండపంలో తిరుప్పావై పారాయణం ప్రారంభం పవిత్ర ధనుర్మాసం సందర్భంగా తిరుమల శ్రీ పెద్దజీయర్ మఠంలో తిరుప్పావై పారాయణం ఆదివారం ప్రారంభమైంది. ఉదయం 7 నుండి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి పాల్గొని మంగళాశాసనాలు అందించారు. శ్రీవారి ఆలయ పరిచారక శ్రీ కె.లక్ష్మీనరసింహన్ తిరుప్పావై ప్రవచనం చేశారు. మొదటి రోజు రెండు పాశురాలను పారాయణం చేశారు. జనవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు తిరుప్పావై పాశురాలను పారాయణం చేస్తారు. ఈ సందర్భంగా నాదనీరాజనం వేదికపై గోదాదేవి సంకీర్తనలను ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకురాలు డా. వందన ఆలపించారు.అదేవిధంగా తిరుమల ఆస్థాన మండపంలో హైదరాబాదుకు చెందిన వేదాంత విద్వాంసులు డా. గోవర్ధనం స్వామినాథాచార్యులు ఉదయం 8 నుండి 9 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు.ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

విశాలాంధ్ర-చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు మండలంలో 2వ రోజు ఎగవూరు, దిగవూరు, చట్టేవారిపాలెం, నెల్లుట్లవారి పల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారి విగ్రహానికి నివాళులు అర్పించి.. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించిన మోహిత్ రెడ్డి గారికి ప్రతి పంచాయతీలో ఘన స్వాగతం పలికారు. భవిష్యత్తు తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద విద్యార్థికీ విద్యను చేరువ చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పన, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నారు. ప్రజలకు ఆరోగ్యకర జీవితాన్ని ప్రసాదించేందుకు రూ. 25 లక్షల వరకు వైద్య సేవలకు ఆరోగ్య శ్రీ పథకం వర్తింప జేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నాడు - నేడు పథకం కింద మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి, సహదేవ రెడ్డి,కొండారెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తలు మోకాళ్ళపై నిరసన

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు వర్కర్లు కార్వేటి నగరం, వెదురు కుప్పం, శ్రీ రంగరాజపురం మండలాలు సంబంధించిన అంగన్వాడి కార్యకర్తలు, వర్కర్స్ హెల్పర్లు, కార్వేటి నగరం స్కంద పుష్కరిణి సమీపం కుమారగిరి పై వెలసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద ఆదివారం మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి దండాలు పెట్టి జగనన్న మనసు మార్చి మా సమస్యలను పరిష్కరించేలా చూడు స్వామి అంటూ కోరుకున్నారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి మమత రాధమ్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి కక్ష సాధింపులు మాకు లేవని మాకు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. మా సమస్యలను పరిష్కరించని ఎడల నిరవధిక సమ్మె కొనసాగిస్తామని తెలియజేశారు. అనంతరం అంగన్వాడీ లా నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు వర్కర్స్ హెల్పర్లు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

విశాలాంధ్ర-కార్వేటినగరం: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని టీటీడీ ఆలయ అధికారి సురేష్కు మార్ అన్నారు. ఆదివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నదానా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ అధికారి సురేష్కుమార్ మాట్లాడుతూ టీటీడీ ఆలయాల్లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నదాన కార్యక్రమానికి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో విశిష్టత నెలకొంది. టీటీడీ అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానంలో అను సంధానంగా ఉంటున్న ఆలయాల్లో ప్రతి శుక్ర, శనివారాల్లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే కార్వేటినగరంలో వెలసి ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో దాతలు ముందుకొచ్చి ప్రతి రోజు పేదలకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆదివారం కుప్పానికి చెందిన భక్తుడు మహేంద్రమణి అన్నదానం చేపట్టారని తెలిపారు ఈ క్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి దాతకు తీర్థ ప్రసాదాలను అందించినట్లు పేర్కొన్నారు.

సామాన్యుడి శంఖారావంతో ప్రజలకు మరింత చేరువ

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : సామాన్యుడి శంఖరావం నినాదంతో ప్రజలకు మరింత చేరువ అవుతామని ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గం , వరదయ్యపాలెం మండల కమిటీ సమావేశం మండల కన్వీనర్ సందింటి శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన సత్యవేడు నియోజకవర్గ నూతన కన్వీనర్ ఎం. నందినిని కార్యకర్తలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపక జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్ఫూర్తితో సామాన్యులు కూడా చట్టసభల్లోకి వెళ్ళడానికి మనకున్న ఏకైక ఆయుధం మన అవినీతి రహిత సిద్ధాంతమని అన్నారు. దానికోసం సత్యవేడు నియోజకవర్గం నందు సామాన్యుడి శంఖారావపేరుతో ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకోవడం కోసం నియోజకవర్గంలో కార్యకర్తలు అందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.జరగనున్న అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ యం.నందిని మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో మార్పు కోరుకునే సామాన్యులు, విద్యావంతులు, యువకులు, మహిళలు, శ్రామికులు ప్రతి ఒక్కరూ పార్టీలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం మండల కన్వీనర్ సందింటి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ మహిళా కన్వీనర్ బొప్పన పార్వతి, సూర్య ,గిరీష్, సందింటి కల్పన తదితరులు పాల్గొన్నారు.

బోయకొండపై తరగని భక్తుల రద్దీ

విశాలాంధ్ర-చౌడేపల్లి : శక్తి క్షేత్రం బోయకొండ పై ఆదివారం భక్తుల రద్దీ అధికమైంది కొండదిన్నాని పురస్కరించుకొని ఉదయాన్నే ఆలయ అర్చకులు వేద పండితులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ చేశారు రాష్ట్రం తో పాటు తమిళనాడు కర్ణాటక నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలు రావడంతో ఆలయం భక్తసంద్రమైంది ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూ లైన్ లన్నీ యాత్రికులతో నిండిపోయాయి వైకాపా ధర్మవరం పరిశీలకుడు పెద్దిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ నాగరాజు రెడ్డి ఈవో చంద్రమౌళి అధికార అర్చక సిబ్బంది సేవలందించారు.

కళామందిరంలో తెల కోవెల పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - పలమనేరు : ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచించిన తెల కోవెల కథా సంపుటి పుస్తకాన్ని ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి కే ఎస్ వి మాట్లాడుతూ మానవత్వం కలిగి ఉండి మనిషిని చైతన్య పరిచే విధంగారచనలు చేయగలిగిన వాడే నిజమైన రచయితఅన్నారు. శతావధాని ఆముదాల మురలి మాట్లాడుతూ... సామాజిక స్పృహ కలిగిన రచనలే నిలబడు కలుగుతాయన్నారు. రచయిత కోసం చదవడం మొదలెట్టి తనకోసం పుస్తకాన్ని పూర్తిగా చదివేలాపుస్తకాలు ఉండాలన్నారు. సభాధ్యక్షత వహించిన రచయిత్రి అరుణకుమారి మాట్లాడుతూ... గ్రామీణ జీవన పరిస్థితులను తన కథలతో చూపించిన రచయితజొన్న విత్తుల అన్నారు. కవితశ్రీ,టి.ఎస్.ఎ కృష్ణమూర్తులు పుస్తకాన్నిపరిచయం చేశారు. ఈ సందర్భంగా రచయిత దంపతులకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి తులసీనాథం నాయుడు, పుష్ప, మాధవ రెడ్డి, సిద్దార్థ లు ఘనంగాసత్కరించారు . ఈ కార్యక్రమంలోమోహిద్దీన్, చంద్రశేఖరయ్య,పలమనేరు బాలాజీ,కవిత, జ్యోతి,గోపీనాథ్,గిరిధర్ మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

వైకాపా రాష్ట్ర వాణిజ్య విభాగ జాయింట్ సెక్రటరీగా మంజునాథ్

విశాలాంధ్ర - చౌడేపల్లి : వైకాపా రాష్ట్ర వాణిజ్య విభాగ జాయింట్ సెక్రటరీగా చౌడేపల్లి కి చెందిన గ్రందెం మంజునాథ్ నియమితులయ్యారు ఆదివారం ఈ మేరకు తిరుపతిలోని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో ఆయన చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలకు సహకరించిన వైకాపా రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ కాణిపాకం దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుడు ముప్పల నరసింహులు శెట్టి లకు గ్రందెం మంజునాథ్ కృతజ్ఞతలు తెలిపారు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైకాపా పార్టీ అభివృద్ధికి కృషిచేసిన గ్రందెం మంజునాథ్ రాష్ట్రస్థాయి పదవిని దక్కించుకున్నందుకు పలువురు ఆర్యవైశ్యులు ఆయనను అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర- చిత్తూరు: నగరంలోని దర్గా చౌక్ వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గొంతు కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం తో ఒక్కసారిగా కుప్ప కూలిపోయిన అతని స్థానిక గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ఆసుపత్రి తరలించారు. ఈ విషయంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దారి సమస్య పరిష్కరించాలని పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర - రామకుప్పం : మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ కి చెందిన పాత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి గతంలో ఉన్న దారిని కొంత మంది దురాక్రమణ కు ప్రయత్నిస్తున్నారని దీంతో పాత ఆసుపత్రి పరిసరాల లో నివసిస్తున్న కుటుంబాలకు దారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సుమారు ఇరవై కుటుంబాలు ఆదివారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఇందుకు సుమారు ఇరవై కుటుంబాలకు దారి లేకుండా పోతోందని వెంటనే స్పందించి తమకు దారి సమస్య పరిష్కారించి న్యాయం చేయాలని కోరారు ఫిర్యాదు చేసిన వారిలో పూజిత, నాగరత్నమ్మ, గోపాల శెట్టి, అంజద్ బాషా, రవి కుమార్, విజయ్, తదితరులు ఉన్నారు.

డాక్టర్ జమకాల ఓబయ్యకు నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

విశాలాంధ్ర - తిరుపతి: ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర కళాశాల నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జమకాల ఓబయ్యకు నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు - 2023 లభించింది. ఈ మేరకు లక్నోలోని సిఎస్ఐఆర్ - నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ (నీసా) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో శనివారం ఆయన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అమిత్ అభిజాత్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన అధ్యాపకులను గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తుంటుంది. ఈ క్రమంలో జమకాల ఓబయ్యను 2023 వ సంవత్సరంలో నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఆచార్య షకీల్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందిన డాక్టర్ జమకాల ఓబయ్య గతంలో కూడా పలు అవార్డులు అందుకున్నారు. ఓబయ్యకు అవార్డు లభించడం పట్ల పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థి సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు భగవద్గీత కంఠస్థం పోటీలు

విశాలాంధ్ర - తిరుపతి: గీతా జయంతి సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషద్ ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం భగవద్గీత కంఠస్థం పోటీలు జరిగాయి.700 శ్లోకాలు కంఠస్థం వచ్చిన వారిలో 18 సంవత్సరాలపై పైబడిన కేటగిరిలో 10 మంది, 18 సంవత్సరాలలోపు కేటగిరి లో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6, 7 తరగతుల నుండి 89 మంది, 8,9 తరగతి చదువుతున్న 47 మంది పాల్గొన్నారు. తిరుపతి జిల్లా పరిధి లోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల నిర్వహణలో 12 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీ సోమయాజులు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు.విజేతలకు డిసెంబర్ 23న జరిగే గీతా జయంతి వేడుకలలో బహుమతి ప్రదానం చేస్తారు.

డ్రైవర్ ను ఢీకొన్న బస్సు

లారీ డ్రైవర్ మృతి- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం పరిధిలోని తొండవాడ హ్యాపీ దాబా సమీపంలో ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ వేల్ మురుగన్ - 45 అక్కడికక్కడే మృతి చెందగా లారీలో వుండిన మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ నుండి చెన్నై కి వెళ్తున్న లారీ తొండవాడ హ్యాపీ దాబా సమీపంలో లారీ పక్కనపెట్టి డ్రైవర్ దిగుతున్న సమయంలో వెనకనుంచి అయ్యప్ప స్వాముల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వేలుమురుగన్ అక్కడికక్కడే మృతి చెందగా లారీలో ఉండిన మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర గాయాలు అయిన వ్యక్తిని 108 ద్వారా చికిత్స నిమిత్తం స్థానికులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చంద్రగిరి మృతి చెందిన వేల్ మురుగన్ ను మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఎస్.వి వైద్య కళాశాలకు తరలించి చంద్రగిరి పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులంటే ఎందుకంత నిర్లక్ష్యం..?

పుత్తేరికి సకాలంలో నడవని ఆర్టీసీ బస్సులు

విశాలాంధ్ర- తొట్టంబేడు: 'సొంత లాభం కొంత మానుకో అన్న నినాదం' అన్నింటికీ వర్తిస్తుంది. అయితే శ్రీకాళహస్తి ఆర్టీసీ యాజమాన్యం సొంత లాభానికే అధిక ప్రాధాన్యతనిస్తూ..సిబ్బంది, ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టేస్తోంది. ఇప్పటికే తీవ్రమైన పని ఒత్తిడి పెంచి పలువురి డ్రైవర్ల మృతి కారణమైన శ్రీకాళహస్తి ఆర్టీసీ యాజమాన్యం, విద్యార్థుల పట్ల కూడా అదే నిర్లక్ష్యపు పంథా అవలంభిస్తోంది. మా మార్గంలో పొద్దుపోక ముందే బస్సు సర్వీసు నడపాలనీ, రాత్రిళ్ళు పొలం గట్లపై నడవాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందంటూ బుచ్చినాయుడుకండ్రిగ మండలం పుత్తేరి మార్గంలో ప్రయాణించే విద్యార్థులు పలుమార్లు ఆర్టీసీ యాజమాన్యంకు విన్నవించినా పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే... తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలం పుత్తేరి మార్గంలో దొమ్మరమిట్ట, లింగమనాయుడు పల్లి, రైస్ మిల్లు, పునబాకు, ఆర్లపాడు, అర్లమాల, పుత్తేరి గ్రామాలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు నిత్యం స్కూళ్లకు, కాలేజీలకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఉదయం పూట విద్యార్థులను వారి వారి గమ్యాలకు సకాలంలో చేరుస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, సాయంత్రం తిరిగి ఇళ్లకు చేర్చే క్రమంలో సమయానికి బస్సును నడపడం లేదు. సాధారణంగా శ్రీకాళహస్తి నుంచి పుత్తేరికి సాయంత్రం 5.15గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరాల్సి ఉంటుంది. అయితే కోవిడ్ కాలం తర్వాత అంటే మూడేళ్లుగా సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య బస్సు శ్రీకాళహస్తి నుంచి పుత్తేరికి బయలుదేరుతోంది. ఈ క్రమంలో బస్సు పుత్తేరికి చేరుకోవాలంటే రాత్రి 8 గంటలు అవుతోంది. దీంతో పొలం గట్లపై ఊర్లకు చేరుకోవాల్సిన విద్యార్థులు రాత్రిళ్ళు పాములు, విష కీటకాల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయంపై పలుమార్లు విద్యార్థులు డిపో మేనేజర్ కు తెలియజేయడంతో కొద్ది రోజుల పాటు తిరుపతి సర్వీసును కాస్త రేణిగుంటకు మార్చి పుత్తేరికి సమయానికి నడిపారు. మళ్ళీ పరిస్థితి యథాస్థితికి చేరడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇకనైనా అధికారులు తీరు మార్చుకుని విద్యార్థుల శ్రేయస్సు కోసం పుత్తేరి బస్సును సకాలంలో నడపాల్సి ఉంది. లేకుంటే విద్యార్థులు ఆందోళన బాట పడతామంటూ హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డిని వివరణ కోరగా తిరుపతికి వెళ్ళే మార్గంలో ఉన్న ట్రాఫిక్ కారణంగా బస్సు ఆలస్యం అవుతోందని చెప్పారు. తిరుపతికి ఓ సర్వీసును రద్దు చేసి పుత్తేరికి సకాలంలో బస్సు నడిపేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

తిరుపతి అభివృద్ధి కోసం ఎంతవరకైనా పోరాడుతాం

- డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి: రైల్వే కాలనీ లోని రైల్వే పెన్షనర్స్ భవనంలో రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే సెలెబ్రేషన్స్ లో డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.రైల్వే పెన్షనర్స్ భవన నిర్మాణానికి సహకరించిన శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి కి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి కి ధన్యవాదాలు తెలుపుతూ నగరంలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అభినయ్ మాట్లాడుతూ తిరుపతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, మన తిరుపతి నగరం పెద్ద పెద్ద నగరాలతో పోటీపడాలనే నగర విస్తరణ అవసరమనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించామని, వై యస్ జగన్ మోహన్ రెడ్డి రి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు కూడా ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు.అదేవిధంగా రానున్న రోజుల్లో తిరుపతిని ఐటి కేంద్రంగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో అడుగులు ముందుకువేస్తున్నామని, దీనికి మీఅందరి సహాయసహకారాలు కావాలని కోరారు.ఇందులో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నారాయణ వైస్సార్సీపీ నాయకులు మునిరామి రెడ్డి, మూలం అశోక్, రాఘవులు నాయుడు , దినేష్ రాయల్ , ఆవుల మురళి యాదవ్ , సప్తగిరి రాజా , కిషోర్ , గౌతమ్ , చందు రాయల్, నాధముని , సాక్షి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి గణిత సత్కారం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ :- గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి గణిత ప్రదర్శన పోటీలో భాగంగా ఆదివారం పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు చేమూరు రవికి సత్కారం అందించారు. ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం మరియు (అప్సాస్ట్) సంయుక్తంగా శ్రీకాకుళంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రామానుజన్ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ గణిత ప్రదర్శన పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పల్లమాల గణిత ఉపాధ్యాయుడు చేమూరు రవి కి ద్వితీయ బహుమతి తో పాటు సుమారు 4000 వేల రూపాయలు నగదును ఇచ్చి సన్మానించడం జరిగింది. అప్సాస్ట్ దిల్లేశ్వరరావు (ఎ పిఎం ఎఫ్) అధ్యక్షులు సూర్యనారాయణమూర్తి గణిత బ్రహ్మ లక్కోజి సంజీవరాయశర్మ కుమారుడు, లక్కోజీ సుబ్బరాయలుశర్మ చే సన్మానించారు రవి చేసిన గణిత మోడల్ అడ్వాన్స్ క్లినోమీటర్ కు ఈ అవకాశం దక్కిందని తెలిపారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

అఖిలభారత పెన్షనర్ల దినోత్సవం

విశాలాంధ్ర - తిరుపతి: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని జిల్లా ఖజానాధికారి లక్ష్మీకర్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం ఉదయం బాలాజీ కాలనీ ఎల్ఐసి రోడ్ లోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో తిరుపతి నగర శాఖ ఆధ్వర్యంలో అఖిలభారత పెన్షనర్ల దినోత్సవం ఘనంగా జరిగింది ఈ సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఖజానా అధికారి ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు .విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తిరుపతి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీ కె. ఆర్. శంకర్ మాట్లాడుతూ ఈరోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సకాలంలో పెన్షన్ పొందుతూ వృద్ధాప్యంలో ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారంటే ఇందుకు కారణం అప్పటి కేంద్ర ప్రభుత్వ ఉన్నత ఉద్యోగి డిఎస్ నకారా గారిని పేర్కొన్నారు. 1972 లో రిటైర్డ్ అయిన నకారా గారు పెన్షన్స్ విషయం లో జరుగుతున్న సమస్యలను గుర్తించి సుప్రీంకోర్టులో వేసిన ఒక ప్రజావాజ్యం దాఖలు చేశారని,1982, డిసెంబర్ 17నచారిత్రాత్మకమైన తీర్పు వెలువడింద ని ఇందులోపెన్షన్ ఉద్యోగి హక్కు అని,ప్రభుత్వ బిక్ష కాదన్నారు.పెన్షన్ ఒక సాంఘీక ఆర్థిక న్యాయము చేకూర్చే సంక్షేమము మొదలగు విషయాలు తీర్పు లో పేర్కొన్నారని తెలిపారు. పెన్షనర్ల జీవితాలలో వెలుగులు నింపుతూ గొప్ప తీర్పు రావడానికి కారకుడైన డి.యస్.నకారా ను స్మరిస్తూ 1983 నుండి ప్రతి ఏడాది డిసెంబరు 17 న దేశ వ్యాప్తంగా పెన్షనర్స్ డే,నాకారా డే, గా సభలు ఏర్పాటు చేసుకొని సీనియర్ పెన్షనర్స్ ను సన్మానించు కొంటున్నా రని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 75 సంవత్సరాలు నిండిన 30 మంది విశ్రాంత ఉద్యోగులను శాలువా ,మెమెంటో,పుష్ప గుచ్ఛం తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరామ్ నాయుడు,తిరుపతి నగర శాఖ ప్రధాన కార్య దర్శి సి. వెంకటేశం శెట్టి,కోశాధికారి యస్. జీ.మునికృష్ణ,జిల్లా కోశాధికారి వి.సిద్దయ్య, జిల్లా సహాధ్యక్షులు టి.గోపాల్ ,యస్.,దేవరాజులు, కార్య నిర్వాహకులు టి.వేంకట రమణ, చిన్నబ్బ,మేహరున్నిబీ,టి.జయలక్ష్మి, భాగ్య లక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్య క్రమం లోస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు శాఖల అధికారులు దినకర్,సత్యనారాయణ,మనోజ్ ,కార్పొరేటర్ ఆర్.వెంకటేశ్వర్లు,లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్,కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూకా విజయ కుమార్, మాజీ టిటిడి బోర్డు మెంబర్,బోత్ హాస్పిటల్ డైరెక్టర్ పి.హరిప్రసాద్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కార్య క్రమంలో పాల్గొన్నవిశ్రాంత డిప్యూటీ కమిషనర్, ఎక్సయిజ్ శాఖ కె.దివాకర్ భవన నిర్మాణానికి 25 వేల రూపాయలు విరాళం ప్రకటించారు. విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్య లో ఈ కార్య క్రమం లో పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా హాకీ నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు జీఎంయుపి స్కూల్ కాంపౌండ్ లో ఆదివారం తిరుపతి జిల్లా హాకీ నూతన కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎలక్షన్ ఆఫీసర్ గా పి రమేష్ కుమార్ , హాకీ ఆంధ్రప్రదేశ్ పి. తామస్ పీటర్, స్పోర్ట్స్ అథారిటీ తిరుపతి అబ్జర్వ్ గా, దీపక్ ఆకాశ బాబు పాల్గొని ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా టీ. సర్జన్ రాజ్, కార్యదర్శి బి. ఆదిత్య,కోశాధికారిగా పి. అబ్రహం కుమార్ ఉపాధ్యక్షులుగా లవ్ కుమార్, గోపీనాథ్, సంయుక్త కార్యదర్శులుగా యుగంధర్ రెడ్డి, బాలసుబ్రమణ్యం కార్యవర్గ సభ్యులుగా చంద్రశేఖర్ రెడ్డి, ఎస్కే నజమా, భార్గవి ఎంపికయ్యారు.

ఆటో మెకానిక్‌కు చేయూత

విశాలాంధ్ర - గూడూరు : ఆటో మొబైల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రమాదంలో గాయపడిన ఆటో మెకానిక్ శ్రీరాములుకు చేయూతనందించారు. ఆటోనగర్ సభ్యులు శ్రీరాములను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందించినందుకు శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షులు కూడ చాలామందికి కమిటీ తరుపున చాందుబాష మాట్లాడుతూ గతంలో మా సంస్థ తరపున అనేకమంది మెకానిక్ లకు ఆర్థిక సహాయం అందించామన్నారు. దాతలు ముందుకొచ్చి మెకానిక్ శ్రీరాములకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు ఎస్.కె. చాందు బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కమ్మిటి నాగరాజు, ఉపాధ్యక్షులు సలీంబాషా, సంయుక్త కార్యదర్శి మహబూబ్ బాషా, కార్యవర్గ సభ్యులు కాలేషా, లక్ష్మీపతి సుభాహాన్, కె. వెంకటేశ్వర్లు అనీల్ కుమార్ రెడ్డి, ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తదితరులు పాల్న న్నారు

వైష్ణవాలయాల్లో తిరుప్పావై పఠనం

విశాలాంధ్ర - గూడూరు : ధనుర్మాసం ప్రారంభమైన సందర్భంగా ఆదివారం గూడూరు పట్టణంలోని పలు వైష్ణవాలయాల్లో తిరుప్పావై పఠించారు. ధనుర్మాసం పండగ నెల గోదాదేవికి ఎంతో ముఖ్యమైన మాసం. గూడూరు పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం కోనేటి మిట్టలో ఉన్న శ్రీ కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో గోదాదేవికి విశేషాలంకరణ ఏర్పాటు చేసి తిరుప్పావైను పఠించారు. జనవరి 14వ తేదీ వరకు ప్రతిరోజు తిరుప్పావై జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

కోట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.నాగబాబు

విశాలాంధ్ర-కోట: కోట పోలీస్ స్టేషన్ కు ఎస్ఐగా పి నాగ బాబు నూతనంగా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్.ఐ గా పని చేస్తున్న పుల్లారావు గూడూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి బదిలీ కాగా ఆయన స్థానంలో వి ఆర్ లో ఉన్న పి నాగబాబు ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. దీంతో పోలీస్ సిబ్బంది ఘనంగా ఆయనకు స్వాగతం పలికారు.

పెన్షన్ బిక్ష కాదు హక్కు..ఏపీ పీఆర్డీఈఏ గౌరవాధ్యక్షులు రియాజ్ అహ్మద్

ఘనంగా జాతీయ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల దినోత్సవం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని డాక్టర్ సీఆర్. రెడ్డి విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమో ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ ఇంజనీర్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి ధర్మ స్వరూప్ నకార పోరాట పటిమతో 1982 డిసెంబర్ 17న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ వైవి. చంద్ర చూడ్ సారధ్యంలోని ధర్మాసనం పెన్షన్ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి ఇచ్చే భిక్ష కాదని వారి హక్కు అని, వారి శేష జీవితాన్ని గౌరవప్రదంగా జీవించాలంటే పెన్షన్ తప్పనిసరిగా ఇవ్వాలని తీర్పును వెల్లడించిందని గుర్తు చేశారు. అప్పటినుండి విశ్రాంత ఉద్యోగులు పెన్షన్లను తీసుకుంటూ ప్రతి డిసెంబర్ 17వ తేదీన జాతీయ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల దినోత్సవం గా నిర్వహిస్తున్నారని తెలిపారు. పాత పెన్షన్ విధానానికి పాటుపడడమే డిఎస్ నకారకి ఇచ్చే ఘన నివాళి అన్నారు. ఈ సమావేశానికి సంఘ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా అధ్యక్ష వహించారు. పెన్షనర్ల సమస్యలను వివరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సి. జనార్ధన్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మయ్యలు పెన్షనర్ల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. అదేవిధంగా డిఎ బకాయిలను వెంటనే చెల్లించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ సెక్రెటరీ ఎం. మోహన్, గౌరవాధ్యక్షుడు జి. సుబ్రమణ్యం, సహ అధ్యక్షులు ఏ. భాస్కరరావు, కోశాధికారి ఎన్ వి. కృష్ణయ్య, ఉపాధ్యక్షులు బి. డేవిడ్ జయకుమార్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ బి. శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ మేనేజర్ బి. గోపి పాల్గొని ప్రసంగించారు. అనంతరం 70 ఏళ్లు నిండిన 19 మంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కటకరాజ వీధిలో కల్వర్టు ఏర్పాటు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణం కట్టకరాజవీధి వాటర్ ట్యాంక్ వెనుకవైపున మూడు రోడ్డులను కలిపే ప్రాంతం ప్రధాన రహదారి వద్ద కల్వర్టు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. శనివారం రాత్రి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్, మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడారు. వెంటనే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కల్వర్టు ఏర్పాటు చేయాలని కమిషనర్ కు సూచించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు అన్నం మురళి, అల్తాఫ్, స్థానికులు ఉన్నారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే

ꣳ

విశాలాంధ్ర - గూడూరు : పట్టణంలోని అంబేద్కర్ నగర్ వరద బాధితులకు న్యాయం చేయలేదని వైసీపీ సీనియర్ నాయకులు కోడూరు మీరా రెడ్డి శనివారం రాత్రి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే అంబేద్కర్ నగర్ కు చేరుకున్నారు. ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడారు. సగం కుటుంబాలకు వరద నరిహారం, రేషన్ అందలేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. చరవాణిలో అధికారులతో మాట్లాడారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కోడూరు మీరారెడ్డి, అన్నం మురళి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి జిల్లా బహిష్కరణ

విశాలాంధ్ర -చిత్తూరు : సంఘ వ్యతిరేక కార్యకలాపాలు ప్రమాదకర కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆరు నెలల పాటు జిల్లా బహిష్కరణ చేసినట్లు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. పలమనేరు మండలం కొలమాసిన పల్లి బీసీ కాలనీ చెందిన చిన్ననాగరాజు అలియాస్ శంకర్ (55) పై ఇదివరకు పలమనేరు అర్బన్ బైరెడ్డిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో మొత్తం ఆర్ కేసులు కేసులు నమోదయాయని అయితే ఇతను పలమనేరు, బైరెడ్డిపల్లి మండలం చుట్టు ప్రక్కల ప్రజలను మభ్యపెట్టి, అతనికి అనువైన ప్రదేశంలో పేకాట ఆడించడం , అక్రమ మద్యం వ్యాపారం చేస్తూ ప్రజాశాంతి కి భంగం కలిగించే విధంగా పనులు చేస్తున్నందున, ఇతనికి ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా చెప్పిన ఇతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. దీని పై పలమనేర్ డి.ఎస్పీ సుధాకర్ రెడ్డి ఇతని పై ఒక నిదికను పంపి ఇతన్ని జిల్లా భహిస్కరణ చేయాలని సిఫార్సు చేయగ , ఆ నివేదిక ను జిల్లా కలెక్టరు షన్మోహన్ కు పంపడమైనదని దానిపై స్పందించిన కలెక్టరు చిన్ననాగరాజు అలియాస్ శంకర్ ను ఆరు నెలల కాలం పాటు జిల్లా బహిష్కరణ చేయాలని ప్రొసీడింగ్ ద్వారా తెలియపరచడమైనదని వివరించారు. దీనిపై పలమనేర్ పోలీసులు అతన్ని ఆరు నెలల పాటు జిల్లా బహిష్కరణ చేసామని తెలిపారు.జిల్లాలో ఎవరైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన శాంతి భద్రతలకు భంగం వాటిల్లే పనులు చేసిన వారిని కూడా జిల్లా భహిష్కరణ చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

మైన్లపై నిరసన సత్యాగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మద్దతు

విశాలాంధ్ర - గూడూరు : పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీలో అక్రమ మైనింగ్ దోపిడీ చేస్తున్న రుస్తుం, భారత్ మైకా మైన్ల కు నిరసనగా ఆదివారం పోలీట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేస్తున్న నిరసన సత్యాగ్రహంకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిలికా, క్వార్ట్జ్ లాంటి సహజ వనరులను అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు దోచుకుంటున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకుల అరాచకాలు పరాకాష్టకు చేరుకున్నాయన్నారు. కోట్ల రూపాయల సహజ వనరులను కొల్లగొడుతున్నారన్నారు. కేజీఎఫ్ సినిమాలలో లాగ మొత్తం త్రవ్వేసి అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ రవాణా వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు అన్ని ధ్వంసం అవుతున్నాయని అన్నారు. సహజ సంపదలు కొల్లగొట్టిన నాయకులను, వారికి సహకరించిన అధికారులను ఎట్టి పరిస్థితుల్లో రాబోయే రోజులలో వదలబోమన్నారు. మా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సత్యాగ్రహ దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం ఈ ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. రాబోవు రోజుల్లో సిలికా, క్వార్ట్జ్, ఇసుక దోపిడిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఇతరుల మైన్లోకి అక్రమంగా ప్రవేశించి, కోర్టు ఆర్డర్స్ ఇచ్చినా లెక్కచేయకుండా కోట్ల రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, నాయకులు శ్రీపతి బాబు, వాటంబేటీ శివకుమార్, తాతపూడి ఇశ్రాయల్ కుమార్, ఎండీ అబ్దుల్ రహీమ్, చంద్ర మౌళి, ఈశం శెట్టి నటశేఖర్, బెజవాడ రమేష్ యువత వేముల సునీల్, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులంటే అంత నిర్లక్ష్యమా..?

విశాలాంధ్ర – వి. కోట: మండల కేంద్రమైన వి. కోటలో ని తమిళనాడు వైపు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి పై స్థానిక ఆర్టీసి బస్టాండు నుండి ఎంపీడీవో కార్యాలయం మీదుగా పాపేపల్లి గ్రామం క్రాస్ వరకు రోడ్డు కిరువైపులా సుమారు మూడు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణంలో డ్రైనేజీలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా నిర్మాణంలో భాగంగా చోటు చేసుకుంటున్న అవినీతి పై ప్రజలు ప్రశ్నించడంతో డ్రైనేజీ పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఇంతకూ ప్రజలు ప్రశ్నిస్తున్న విషయం ఏంటంటే... మండలంలోని తోటకనుమ నుండి మండల కేంద్రం పై తమిళనాడు సరిహద్దు లోని నాయకనేరి వరకు మంగళూరు – విల్లుపురం ఎన్. హెచ్ 75 జాతీయ రహదారి వెళు తుంది. ఇందులో భాగంగా గతంలో ఎన్. హెచ్. ఎ. ఐ అధికారులు రహదారి వెంబడి రోడ్డు విస్తరణ కోసం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద నుండి దుర్గమ్మ గుడి వైపు కు వెళ్లే రోడ్డు కిరువైపులా జాతీయ రోడ్డును ఆక్రమించుకున్న భవనాలను గుర్తించి. గుర్తులు వేశారు. భవన యజమానులకు నష్టపరిహారం కింద సుమారు ఒక కోటి యాభై నాలుగు లక్షల నలభై ఏడు వేల నాలుగు వందల డెభ్బై ఏడు రూపాయలు సుమారు నలభై ఏడు మందికి పరిహారం కూడా ప్రభుత్వం అందజేసింది. కానీ సంబంధిత అధికారులు మాత్రం స్థలాలను స్వాధీనం చేసుకోలేక పోయారు. ప్రస్తుతం ఓ కాంట్రాక్టర్ ఈ రోడ్డు వెంబడి సుమారు మూడు కోట్ల యాభై లక్షల రూపాయల తో డ్రైనేజీలు నిర్మాణం చేపడుతున్నారు. అసలు విషయం ఏంటంటే జాతీయ రహదారిపై డ్రైనేజీలు నిర్మాణం అంటే తారు రోడ్డు నుండి రెండు మీటర్ల దూరంలో చేపట్టాలి. డ్రైనేజీ నిర్మాణం అనంతరం విద్యుత్ స్థంబాలు ఏర్పాటు కు స్థలం వదలాలి అలాగే ఇతరత్రా అండర్ గ్రౌండ్ కేబుల్స్ పంచాయతీ, లేక మున్సిపల్ నీటి కుళాయిల పైపులైన్లు ఏర్పాటు కోసం స్థలం ఉండాలి అనేది నిబంధన. ఐతే ఈ నిబంధనలను గాలికివదిలేయడం ఒకటైతే... జాతీయ రహదారి వెంబడి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించడం కోసం స్థల భవన యజమానులకు డబ్బులూ ఇచ్చేశారు... ఆ భవనాలను ఒక్క అడుగు కాదు కదా ఒక్క అంగుళం కూడా తొలగించలేదుకదా.. అదే భవనాల యజమానులతో కుమ్మక్కైభవనాల ముందు పదుల అడుగుల మేర జాతీయ రహదారి స్థలాలను అప్పనంగా వదిలేసి మరీ డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నారు. ఎంత విడ్డూరం. ఇదిలా ఉంటే ఆ కాంట్రాక్టర్ మరో ఘన కార్యం చేస్తూ ప్రజలను విస్తుపరుస్తున్నారు అదెలా అంటారా.. ఏం ఇంటి ముందు కాల్వ ఎలా తిప్పాలో అలా ముందుకు వెనక్కు తిప్పుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంకో గమ్మత్తేంటంటే విద్యుత్ స్థంబాలున్న చోట యూ టర్న్ లు, ఎస్ కటింగులు కూడా ఇచ్చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల అయితే పరిహారం పొందిన భవన యజమానులు రోడ్డుపై వేసుకొన్న బోరు బావులు కూడా డ్రైనేజీల నిర్మాణం మధ్యలో ఎంచక్క ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ డ్రైనేజీ నిర్మాణం లో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయి. . పై విషయాలన్నీ ఎన్. హెచ్. ఏ. ఐ. అధికారులకు తెలియవా...? అంటే తెలుసు.. వారి దృష్టికి పత్రికలు, ప్రజలు తీసుకెళ్లారు. పనిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఇక తర్వాత ఏంటి..? అనేది కోటి రూపాయల ప్రశ్నగా మారింది. సరిదిద్దడమా...? లేక సర్దుబాటా...? అనేది వేచి చూడాలి. ఇఇ. దృష్టికి డిఇ దృష్టికి చరవాణి ద్వారా పత్రికలు, ప్రజలు సమాచారం అందించగా తదుపరి విచారణకు ఏఇ ని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం చరవాణి ద్వారా ఏఇ ని ఈ విషయమై వివరాలు అడగ్గా డ్రైనేజీలనిర్మాణం పై ఆరోపణలు వస్తున్న మాట నిజమే సంబంధిత కాంట్రాక్టర్ ను ఈ విషయమై అడగడానికి ప్రయత్నం చేశామని ప్రస్తుతం ఆయన మాల వేసి శబరిమలై వెళ్లారని వచ్చిన తర్వాత మాట్లాడుతానని కాంట్రాక్టర్ తెలిపినట్లు కొన్ని రోజుల క్రితం ఏఇ తెలిపారు. ఆ తర్వాత మాట్లాడారో లేదో వారికే తెలియాలి. ఇంతకీ ప్రజలు ఏమంటున్నారంటే జాతీయ రహదారిపై నిర్మాణాలు చేసుకున్న వారికి పరిహారంగా డబ్బులు ఇచ్చేశారు. స్థలాలూ వదిలేశారు. దానికి తోడు ఆ భవనాల ముందు లక్షల విలువ చేసే అదనపు స్థలాలు వదిలేశారు. ఇదేం విడ్డూరం అధికారులకు బాధ్యతలు ఉండవా?లేదా... అంటున్నారు. ప్రభుత్వ నిధులంటే అంత నిర్లక్ష్యమా...పనుల్లో జరిగిన తప్పులను సరిదిద్దడమా.. సర్దుబాటు చేయడమా.. అని ప్రశ్నించుకుంటున్నారు.దీనిపై సంబంధిత అధికారులు ఏమాత్రం స్పందిస్తారో వేచిచూడాల్సిందే.....

పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించిన డ్వాక్రా మహిళ

విశాలాంధ్ర – వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలం డ్వాక్రా గ్రూప్ ల్లో అవినీతి చేసిన కొందరు అధికారుల తీరు తెలిసిందే!.నాగలక్ష్మి డ్వాక్రా గ్రూపులో సభ్యురాలు గా ఉన్న నవనీతమ్మ జగన్ మోహన్ రెడ్డి తనకు అందజేసిన వైఎస్సార్ ఆసరాలో స్థానిక అధికారులు కొందరు తనను మోసం చేశారని,తనకు న్యాయం చేయాలని మరోసారి స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు ఫిర్యాదు సమర్పించారు. ఇందిరానగర్ గ్రామపంచాయతీ లోని పద్మావతి పురం నందు వెలుగు స్వయం సహాయక (ఎస్హెచ్జి)బృందం నాగలక్ష్మి గ్రూప్ సంఘ సభ్యురాలుగా ఉంటూ,రెండవ లీడర్ గానూ సేవలు అందించానని ఆమె తెలిపారు. ఒకటవ ఇందిరానగర్ గ్రామ సమాఖ్య వివిఎ సంఘమిత్ర బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో అధికారులతో కలసి చేసిన అవకతవకలు వలన తీవ్రంగా నష్ట పోయానని నవనీతమ్మ పేర్కొంది.బ్యాంకులో లోన్లు తీసుకుని బకాయిలు పడి ఉన్న వారికి జగనన్న ప్రభుత్వం రుణమాఫీ క్రింద విడతలవారీగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా సంఘ అకౌంటుకు జమ చేయడం జరిగింది.ఇది ఇలా ఉండగా తన అకౌంట్ నందు జమ కాలేదని,వరదయ్యపాలెం ఎస్బిఐ నుండి గ్రూప్ సభ్యులకు బ్యాంకు ఖాతా ద్వారా కాకుండా,నగదు చెల్లింపుల కౌంటరు డ్రా చేసినట్టు ఆమె తెలిపారు.ఇది జరుగుతున్న సమయంలో అప్పటి సంఘమిత్ర విధి నిర్వహణలో అవినీతి ఆరోపణలపై తొలగించబడింది. రికార్డులను అప్పగించకుండా తన వద్దనే ఉంచుకొని అక్రమాలకు పాల్పడిందని ఆమె తెలిపింది. వైయస్సార్ ఆసరా కింద విడతల వారీగా లోను బకాయిలను ప్రభుత్వం జమ చేసిన,తనకు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెట్టారని తెలిపింది.ఇదే విషయమై గతంలో పోలీస్ లకు ఫిర్యాదు చేయగా,అధికారులు కొంత మొత్తం ఇప్పించారని, ఇంకా తనకు రావలసి ఉందని, అధికారులు చుట్టూ తిరిగి అలసి పోయానని,తప్పనిసరి పరిస్థితులలో మరోసారి ఫిర్యాదు అందించవలసి వచ్చిందని,దీనిపై చర్యలు తీసుకోవాలని,స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు నవనీతమ్మ ఫిర్యాదు చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలి

బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్



విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : దేశ ప్రజల అభివృద్ధి కోసం "వికసిత్ భారత్ సంకల్ప యాత్ర"ను ప్రధాని నరేంద్రమోడి ప్రారంభించారని, కేంద్ర బీజేపీ ప్రభుత్వ పథకాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ కుమార్ కోరారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ భారత్ సంకల్ప బస్ యాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గములో వాడవాడలా జరుగుతున్న బస్ యాత్ర కార్యక్రమానికి కోలా ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " ప్రజల వికాసమే దేశ అభివృద్ధి" లక్ష్యముతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్ప కృషితో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి రూరల్ మండలం నందు రామలింగాపురం పంచాయతీ, సుబ్బానాయుడు కండ్రిగ పంచాయతీ, తొట్టంబేడు మండలంలోని పిల్లమేడు పంచాయతీలలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ, అసెంబ్లీ పార్టీ కో – కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు కునాటి నాగరాజు, వేదం కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిలు మోదుగుల నాగరాజు, పోలి సత్యనారాయణ, కందాటి మునిరాజ, కుప్ప ప్రసాద్, పేరుబోయిన ధర్మయ్య యాదవ్, లింగా బత్తిన గోపాల్, కన్నా వెంకటేశ్వలు, కునాటి చెంచు బత్తెయ్య, సుధాకర్ రెడ్డి, సర్పంచ్ కె. సుబ్బమ్మ, టి. చెంగల్రాయులు రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు సునీల్, శ్రీనివాసులు, ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వి రమణ, పగడాల ప్రతాప్, కోట వెంకటేష్, కాశీ రాజనేల, చిత్తికాటు బాలాజీ, వివిధ డిపార్ట్మెంట్ ల అధికారులు, లబ్దిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర – తిరుపతి : ఎన్నికల కమిషన్ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలను ప్రకారమే మనం విధులు నిర్వహించాలి అని , పెండింగ్ దరఖాస్తు లు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణారెడ్డి ఆర్ ఓ లను ఆదేశించారు.ఆదివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో తిరుపతి జిల్లాలోని నియోజకవర్గ ఆర్ ఓ లతో, పోలీస్ అధికారులతో సమావేశమై ఎస్ ఎస్ ఆర్ 2024, ఎన్నికల కమిషన్ సూచిస్తున్న ఆదేశాలపై జిల్లా కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారుజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ– 2024 మేరకు అన్ని క్లెయిమ్స్ త్వరగా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. ప్రింట్ అందిన ఎపిక్ కార్డులు పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా మాత్రమే పంపిణీ చేయాలి. రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ముందుగానే వల్నరబుల్ ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సెక్టార్ అధికారులు నియమించడం, కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్ ల జాబితా సిద్ధం చేయాలని , ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎవరైనా అడ్డంకులను ఎదుర్కొనే సంఘటనలు గతంలో ఎక్కడైనా చోటుచేసుకుంటే ఆయా ప్రాంతాలపై ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ లు పూర్తి పర్యవేక్షణ వుండేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.సెక్టార్ అధికారి, సెక్టార్ పోలీస్ అధికారి సంయుక్తంగా వల్నరబుల్ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికను ఎన్నికల కమిషన్ కు నివేదించాలి తెలిపారు.ఈ సమీక్షలు నగరపాలక కమిషనర్ హరిత, అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ , జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి , కిరణ్ కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, నగరపాలక డిసి చంద్రమౌళీశ్వర రెడ్డి, ఏఈఆర్వోలు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

గవర్నర్ సభా ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర – తిరుపతి : తిరుపతి వేదికగా జరగనున్న వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్న సభా ఏర్పాట్లను కార్యక్రమం కో గవర్నర్ ఆర్డినేటర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈ నెల 18వ తేది జరిగే వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 'మన సంకల్పం – అభివృద్ధి చెందిన భారత్' అనే నినాదంతో వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందుకోసం మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో చేస్తున్న, చేయాల్సిన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సభకు వచ్చే వారికి అవసరమైన సౌకర్యాలు అన్ని కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పథకాల వివరాల గురించి తెలియజేసే స్టాల్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ.లు సంజయ్ కుమార్, రాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.

20 న పుత్తూరులో జాబ్ మేళా

విశాలాంధ్ర –చిత్తూరు: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంటు కార్పొరేషన్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా పుత్తూరులో ఈ నెల 20 తేదీన మెగా జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ అభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్ రెడ్డి తెలిపారు. పుత్తూరు డిగ్రీ కాలేజీలో ఈ జాబ్ మేళాను ఉదయం 9 గంటలకు రాష్ట్ర యువజన పర్యాటక సాంస్కృతిక క్రీడాశాఖ మాత్యులు ఆర్.కె. రోజా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇందులో 23 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరు కానట్లు తెలిపారు . ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ , యువకులు సద్వినియోగం చేసుకోవాలని , ఈ మెగా జాబ్ మేళాకు హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ,యువకులు విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా,బి. ఫార్మసీ ఫార్మసీ, నర్సింగ్ ఏనీ డిగ్రీ , ఏనీ బి.టెక్, పి.జి, చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని,ఈ రిజినల్ జాబ్ మేళా లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ 10 వేల నుండి 30 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు.ఈ ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్,ఆధార్ కార్డ్,రెండు ఫోటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6300954441, 6304330520, ఫోన్ నంబర్స్ కు సంప్రదించాలని తెలిపారు.

నేడు గ్రీవెన్స్ డే రద్దు

విశాలాంధ్ర –చిత్తూరు : జిల్లా కేంద్రం లో సోమవారం జరుగు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అనివార్య కారణాలవల్ల గ్రీవెన్స్ డే ని రద్దు చేయడం జరిగిందని. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని, జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.